క్లుప్తంగా

ఎస్‌ఐకు ఘన సన్మానం



ఎస్‌ఐ కృష్ణవేణిని సన్మానిస్తున్న సిబ్బంది

గాండ్లపెంట: తాడిమర్రికి బదిలీ అయిన గాండ్లపెంట ఎస్‌ఐ కృష్ణవేణికి బుధవారం కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. గాండ్లపెంట స్టేషన్‌కు తొలి మహిళా ఎస్‌ఐగా కృష్ణవేణి బాధ్యతలు చేపట్టారని, సాధారణ ఎన్నికల్లో గొడవలు, వివాదాలు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకున్నారని సీఐ కొనియాడారు. అనంతరం ఎస్‌ఐకు పూలమాల వేసి దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రంగానాయక్, హెచ్‌సీలు తిరుమలరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహా నగర సంకీర్తన



నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి రూరల్/ ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లాకు చెందిన 2500 మంది సత్యసాయి భక్తులు పుట్టపర్తికి విచ్చేశారు. బుధవారం సాయంత్రం మహానగర సంకీర్తను హనుమాన్ సర్కిల్ వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ రాజు ప్రారంభించారు. భక్తులు సత్యసాయి చిత్రపటాన్ని రథంపై ఊరేగిస్తూ, సత్యసాయి నామాన్ని కీర్తిస్తూ ముందుకు సాగారు. అలాగే ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహా సమాధిచెంత భక్తులు నిర్వహించిన సంగీతకచేరి అలరించింది.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీహెచ్‌ఓ హేమలత పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఆరోగ్య కార్యకర్త కోమలి నిర్వహించిన చిన్నారుల వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు నరసమ్మ, ధనమ్మ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చెన్నేకొత్తపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉంటోంది. అందులో దోమలు పెరిగి వ్యాధులు సోకే అవకాశం ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. బుధవారం మండల పరిధిలోని న్యామద్దెల-2 సచివాలయం పరిధిలోని ప్రాంతాల్లో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యటించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సచివాలయ ఏఎన్ఎం అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఆశావర్కర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

25 వరకూ ఆధార్ క్యాంపులు



చెన్నేకొత్తపల్లిలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు ఈనెల 25 వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సచివాలయంలో ఆధార్ క్యాంప్ నిర్వహించారు. ఆధార్ కార్డు కలిగిన వారు అందులో ఏమైనా తప్పులు ఉంటే సవరించుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

బాలికల రక్షణపై అవగాహన

ముదిగుబ్బ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ముదిగుబ్బ జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో బాలికల రక్షణపై సీఐ శ్యామరావు అవగాహన కల్పించారు. సమాజంలో బాలికలు ఎలా మెలగాలి, వ్యక్తుల పట్ల ఎలా ప్రవర్తించాలి, ఏదైనా సమస్య, ఆపద వచ్చినపుడు పోలీసులను ఎలా సంప్రదించాలి తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణప్ప, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, పీడీ రేఖ, సాయినాథ్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపయోగపడే పనులు చేయండి

బత్తలపల్లి: ఉపాధి హామీ పథకం నిధులతో రైతులకు, గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులనే చేపట్టాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడులను వారి వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆహ్లాదం.. ఆనందం..

ధర్మవరం: భారీ వర్షాలకు ధర్మవరం చెరువు మరువ పారుతోంది. పట్టణవాసులు బుధవారం చెరువు వద్దకు చేరుకుని మరువ పారే ఆహ్లాదకర దృశ్యాలను చూసి ఆనందంగా గడిపారు. కొందరు యువకులు చెరువులోకి దూకి ఈత కొడుతుంటే.. పెద్దలు చెరువు వద్ద తినుబండారాలు తింటూ కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేశారు. గంగమ్మ తల్లికి మహిళలు పూజలు చేశారు. ప్రజల సందడితో చెరువు మరువ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా మారిపోయింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న ధర్మవరం చెరువు మరువ



మరువ వద్ద ఈత కొడుతున్న యువకులు



మరువ వద్ద జనాల సందడి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సలహాలిస్తున్న ఏడీఏ క్రిష్టయ్య

బత్తలపల్లి: ఈదులముష్టూరులో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం ఏడీఏ క్రిష్టయ్య కంది, ఆముదం పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

రామగిరి: పేరూరులో బుధవారం వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలు పట్టారు. అన్నదాన కార్యక్రమం అనంతరం వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఊరేగించారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

పుట్టపర్తి అర్బన్: వర్షాలు తగ్గుముఖం పట్టాక దోమల ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ మునిచంద్రిక సూచించారు. బుధవారం పైపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రజలనుద్దేశించి డాక్టర్ మాటాడారు. సీహెచ్‌ఓ నగేష్ పాల్గొన్నారు.

నీటమునిగిన పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పంటలను ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య పరిశీలించారు. ఈ నెల 18న, 23న 'వర్షానికి పంట నాశనమైంది', 'అప్పరాచెరువులో తడిసిపోతున్న వేరుశనగ' పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. బుధవారం ఏడీఏ కృష్ణయ్య, ఏఓ ఓబిరెడ్డి ఆయా గ్రామాల్లో నీటమునిగిన వేరుశనగ తదితర పంటలను పరిశీలించారు. పంటల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వారు చెప్పారు.

చెన్నేకొత్తపల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని చెరువులు మరువ పారుతున్నాయి. న్యామద్దెల పంచాయతీ పరిధిలోని హరియాన్ చెరువు వద్ద సాగు చేసిన వరి నీట మునిగింది. ఈ విషయాన్ని రైతులు తహసీల్దార్ సురేష్ కుమార్, వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు బుధవారం అక్కడికి వెళ్లి నీట మునిగిన పంటలను పరిశీలించారు. పంటలు నీట మునగడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు తెలిపారు. దెబ్బతిన్న పంటల నివేదిక తయారు చేసి ఉన్నతాధికారు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పన్నులు త్వరగా పూర్తి చేయండి

ధర్మవరం అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఇంటి, కొళాయి పన్నులు, షాపు గదుల అద్దెల వసూలును త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులు, వార్డు పరిపాలనా కార్యదర్శులతో పన్నుల సేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో నిర్మించే భవనాలకు కొత్తగా పన్నులు విధించాలన్నారు. మున్సిపల్ షాపు గదుల అద్దె ఎప్పటికప్పుడు వసూలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ఇంటి పన్నులతోపాటు నీటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. కమర్షియల్ షాపుల పన్నులు పెండింగ్‌లో ఉంటే వెంటనే కట్టించుకోవాలని ఆదేశించారు.

రీ సర్వేలోని సమస్యలు తెలపండి

బత్తలపల్లి/ గాండ్లపెంట: సమగ్ర భూముల రీ సర్వేలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత సూచించారు. బుధవారం సంగాల రెవెన్యూ గ్రామంలో భూముల రీసర్వే సమస్యల పరిష్కారం కోసం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్-భూముల రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1502 ల్యాండ్ పార్సిల్ మ్యాప్ నంబర్లుగా ఉన్నాయన్నారు. పైలట్ ప్రాజెక్టు గ్రామంలో రీసర్వే సమస్యలపై గ్రామసభల ద్వారా రైతులు 62 అర్జీలు అందజేశారన్నారు. వాటిలో జాయింట్ ఎల్పీఎంలుగా 50, విస్తీర్ణం తేడా 12 అర్జీలు ఉన్నట్లు వివరించారు. గ్రామసభలో సర్వే ఐ.డి. మురళి, రీసర్వే డీటీ షణ్ముఖ కుమార్, సర్వేయర్ జోసఫ్, వీఆర్వోలు తలారి చంద్రశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గాండ్లపెంట మండలం సామచేనుబైలు గ్రామంలో బుధవారం తహసీల్దార్ బాబురావు ఆధ్వర్యంలో భూ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి భూమికి సంబంధించిన 9 వినతులు అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ జాఫర్‌వలి, వీఆర్వో చంద్రశేఖరరెడ్డి, సచివాలయ సర్వేయర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నల్లచెరువు: భూముల రీ సర్వేల్లో సమస్యలున్న రైతులు వినతిపత్రాలు ఇస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని పంతుల చెరువు, తవళంమర్రి గ్రామాలలో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు బుధవారం రీసర్వే సమస్యలపై గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు సర్పంచులు స్వర్ణలత, అంజినమ్మ, పంచాయతీ కార్యదర్శి ఉమారాణి, వీఆర్‌ఓ సుకన్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, కార్మికులు

ధర్మవరం: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పారిశుధ్య కార్మికులతో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు బాబు, ముకుంద మాట్లాడుతూ కరోనా సమయంలో తీసుకున్న కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడో డివిజన్‌లో మస్టర్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ హాస్పిటల్‌ను ధర్మవరంలోనే ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు లక్ష్మీ ఓబిలేసు, ప్రసాద్, రామకృష్ణ, ఆదినారాయణ, శ్రీనివాసులు, పెద్దక్క, సూర్యనారాయణ, రమేష్, చంద్ర, వెంకటేషులు, శ్రీనివాసులు, బాలమురళి, చెన్నకేశవులు, కార్మికులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి పాటుపడదాం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

నల్లచెరువు: బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంఈఓ తిరుపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆర్డీటీ వారు అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. తొలుత కేజీబీవీ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ విద్యార్థినులతో ఉపాధ్యాయులు ర్యాలీగా వెళ్లి బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఈఓ తిరుపాల్ నాయక్, ఆర్డీటీ పర్సేస్ డైరెక్టర్ పుష్పలత, సీఓ నారాయణస్వామి, రాంప్రతాప్‌రెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నర్సరీలకు కోలుకోలేని దెబ్బ

- నారు మొక్కలు పడేస్తున్న యజమానులు
- సకాలంలో వర్షాలు రాక వృథా అయిన వైనం
- రూ.1.50 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా



దిబ్బల్లో నారు మొక్కలను పడేసిన నర్సరీ యజమానులు

బత్తలపల్లి: నర్సరీ యజమానులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నారు మొక్కలు నాటే అవకాశం లేక వృథా అయిపోయాయి. మండల కేంద్రం బత్తలపల్లిలో దాదాపు 70 నర్సరీలు ఉన్నాయి. ప్రతి నర్సరీలోనూ రైతులకు అవసరమైన వంగ, టమాట, మిరప, పూల నారు సిద్ధం చేశారు. వర్షాభావంతో పాటు బోరు బావులలో నీరు అడుగంటిపోవడంతో మొక్కలను తీసుకువెళ్లేందుకు రైతులు ముందుకు రాలేదు. దీంతో నర్సరీల్లో పెరిగిన మొక్కలు ఎటూ కాకుండా పోతున్నాయి. నర్సరీలలోని ట్రేలలో నారు విత్తనం వేస్తే అందులో 25 రోజులకు మొక్క సిద్ధమవుతుంది. నెల రోజులలోపు వాటిని రైతులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇలా 70 నర్సరీల్లోనూ దాదాపుగా మూడు కోట్లకు పైగా మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు రాలేదని మొక్కలు కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పెట్టుబడి రూపంలో రూ.1.50 కోట్ల మేర నష్టం వాటిల్లి అప్పుల్లో కూరుకుపోయామని నర్సరీ యజమానులు వాపోతున్నారు. నాటడానికి సమయం అయిపోయిన మొక్కలను దిబ్బల్లో పడేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తమ ఇబ్బందులను గమనించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

పుట్టపర్తి: టీచర్ల పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు మెరుగైన పీఆర్సీ అమలు చేయాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ తదితరులు బుక్కపట్నం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ డీఏ, సంపాదిత సెలవులు, పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, నెలవారీ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ అసిస్టెంట్ల పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు హనుమంతు, సామకోటి మల్లికార్జున, రామచంద్రరాజు, గోపాల్, రామాంజనేయులు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అపార నష్టం



నేలవాలిన వరిపంటను చూపుతున్న రైతు

కనగానపల్లి: భారీ వర్షాలు రైతన్నలకు అపార నష్టం మిగిల్చాయి. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కనగానపల్లి చెరువు కట్ట తెగిపోయింది. నీరంతా ఆయకట్టు కింద ఉన్న 50 ఎకరాల్లోని వరి మళ్లపై ప్రవహించటంతో పంటంతా నేలకొరిగింది. సుమారు రూ.కోటి దాకా పంట నష్టం సంభవించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ముక్తాపురం గ్రామంలోని చెరువు ఒకేసారి నిండి పెద్ద మరవ పారడంతో ఆయకట్టు కింద ఉన్న వరి మళ్లు, కాయగూరల పంటలు దెబ్బతిన్నాయి. వీటితో పాటు జాతీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంకు నీటి మునగటంతో రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. అలాగే మామిళ్లపల్లి, కుర్లపల్లి, దాదులూరు, కనగానపల్లి, కోనాపురం, యలకుంట్ల గ్రామాల్లో మెట్ట భూముల్లో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, పత్తి, కంది పంటలు నాశనమయ్యాయి.

1,000 ఎకరాలకు పైగా పంటల నష్టం..

భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంట నష్టం భారీగా సంభవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు తూతూమంత్రంగా పర్యటించిపోతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు ఎక్కడా పంట నష్ట వివరాలు అడగటం లేదని కనగానపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లోని రైతులు తెలిపారు. మండలంలో ఎప్పుడూ లేనంతగా 198 మి.మీ వర్షపాతం నమోదైంది. 1,000 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి.

బాధితులను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు చెన్నేకొత్తపల్లిలో 19, రామగిరిలో 8, కనగానపల్లిలో 5, ముదిగుబ్బలో 7, మొత్తం 39 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. అలాగే చెన్నేకొత్తపల్లిలో 62.49 ఎకరాలు, కనగానపల్లిలో 215, రామగిరిలో 95 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లిలో 32 గొర్రెలు, రామగిరిలో ఒక ఆవు మృతి చెందాయని వివరించారు. నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధితులను ఆదుకుంటామన్నారు.

మరువ వద్ద పోలీసు బందోబస్తు

ధర్మవరం రూరల్: గొట్లూరు చెరువు మరువ పారుతోంది. ఈ నీరు దిగువన సుబ్బరావుపేట బ్రిడ్జి వద్ద రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ సందర్భంగా పలువురు బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న నీటిలోకి దిగి చేపలు పట్టడం, సరదాగా ఈత కొట్టడం చేస్తున్నారు. ముఖ్యంగా యువకులు మరువ నీటి వద్ద సరదాగా గడుపుతున్నారు. ప్రమాదం అని తెలిసి కూడా ఇలాంటి సాహసాలు చేస్తుండడంతో రూరల్ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా మరువ నీళ్లు ప్రవహించే బ్రిడ్జిలు, వంకలు తదితర చోట్ల బందోబస్తు ఏర్పాటు చేశారు.

పొలాలకు రక్షణ గోడ నిర్మించండి

బత్తలపల్లి: భారీ వర్షాలకు గొట్లూరు చెరువు, పోట్లమర్రి వాగుల నుంచి ప్రవహించే వర్షపు నీరు పొలాల్లోకి రాకుండా రక్షణ గోడ నిర్మించాలని పలువురు రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. బుధవారం వేల్పుమడుగు వద్ద ప్రవహిస్తున్న చిత్రావతి నదిని ఇరిగేషన్ డీఈ మహేశ్వర్‌రెడ్డి, ఏఈ నాగభవ్య పరిశీలించారు. పలువురు రైతులు పొలాల వద్ద రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరాన్ని వివరించారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి టౌన్: భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోవాలని పుట్టపర్తికి చెందిన ప్రముఖ బిల్డర్ చల్లా సాయికృష్ణ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పెళ్లి చేసుకునే అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండినట్లు జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సామూహిక వివాహాల్లో వధూవరులకు నూతన వస్త్రాలు, మాంగల్యం, గృహోపకరణ వస్తువులు అందజేయడంతో పాటు బంధువులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 15న కొత్తచెరువు మండలం చెన్నకేశవపురం ఆలయంలో సామూహిక వివాహాలు నిర్వహిస్తామన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

నల్లమాడ: నల్లమాడ గ్రామపంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జగనన్న లే అవుట్‌లో వారు ఆందోళన చేపట్టారు. పేదలకు ఇంటి పట్టాలతోపాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమణ, నాయకులు గంగాద్రి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

నల్లమాడ: నల్లమాడ గ్రామ పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం లే అవుట్‌లో వారు ఆందోళన చేపట్టారు. పేదలకు ఇంటి పట్టాలతోపాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

తనకల్లు: కోటపల్లిలో ఓ వ్యక్తి వద్ద అక్రమంగా ఉంచుకున్న 184 ప్యాకెట్ల మద్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

బాధితులను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి: మండలంలో వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. పంట నష్టం వివరాలను వెంటనే తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని అక్కంపల్లి, పోలేపల్లి, కుంటిమద్ది గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కోతకు గురైన రోడ్ల వివరాలతో నివేదికను వెంటనే తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి రూరల్: అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన కమిషనర్ ప్రహల్లాద ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడుతోందని పాలక, ప్రతిపక్ష సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, ఇబ్బడిముబ్బడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోందని మండిపడ్డారు. సత్యసాయిబాబా 99వ జయంతి ఉత్సవాలు విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. చిత్రావతి నది నీటితో ముంపునకు గురవుతున్న సాయినగర్, జానకిరామయ్య కళ్యాణ మండపం ఏరియా, సత్యమ్మ సర్కిల్ ప్రాంతాల ప్రజలను సౌకర్యార్థం నదికి కరకట్ట నిర్మించాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిల్ సభ్యులు చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్, సాయిగీత, ఈశ్వరమ్మ, పవన్‌కుమార్, రత్నప్ప చౌదరి, లక్ష్మీదేవితోపాటు అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి



బిల్లే గణేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐలు తదితరులు

ధర్మవరం అర్బన్: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా తిరుపతిలో స్మగ్లర్ల నుంచి ఎర్రచందనం రక్షణలో అమరుడైన బిల్లే గణేష్ చిత్రపటానికి బుధవారం టూటౌన్ సీఐ రెడ్డప్ప, 14వ బెటాలియన్ సీఐ ప్రదీప్ కుమార్, హెచ్ఎం పద్మావతి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, కోశాధికారి నాగేంద్ర నివాళులర్పించారు.

ధర్మవరం రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా బుధవారం ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు పోలీసుల ప్రాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోతుకుంట గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు పోలీసుల బాధ్యతలు, విధులు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.